క్లుప్తంగా

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో ముసలిమడుగు గ్రామం, కొమరం వారి గుంపు, కనితి వారి గుంపులో సమస్యలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కణితి వారి గుంపుకు సరైన రోడ్డు వేయాలని, ముసలమడుగు గ్రామంలోని జీపీఎస్ స్కూల్లో కాంపౌండ్ లోపల గ్రావెల్ పోయాలని కోరారు. కొమరం వారి గుంపులో ఉన్న ఒకే బోరు పాడైపోగా.. దానికి తక్షణమే మరమ్మత్తు చేయించాలన్నారు. పర్ణశాల మాజీ ఉప సర్పంచ్ వాగే ఖాదర్ బాబు, కొండలరావు, విజయ్ కుమార్, వాగే దాసు, సుజాత, కొమరం నరేష్, కురసం సమ్మయ్య, కోసం ధర్మయ్య, కల్తీ లక్ష్మి, వాగే చిలకమ్మా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

అశ్వారావుపేటరూరల్: సీపీఐ, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కార్మికులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్ లోగల పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆ పార్టీ జిల్లా నాయకులు ఎస్‌డీ సలీం ప్రారంభించారు. శిబిరంలో 70 మంది కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేసి, హెల్త్ కార్డులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గన్నిన రామకృష్ణ, విజయకాంత్, చీపుర్ల సత్యవతి, సూర్య కుమారి, హెల్త్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నిరసనల అడ్డగింత

మణుగూరురూరల్: రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన యాత్రలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ నిరసన కార్యక్రమం చేపట్టారు. మణుగూరు సీఐ పి.నాగబాబు, ఎస్సై రంజిత్‌లు వెంటనే సంఘటన ప్రాంతానికి చేరుకుని నిరసనను, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. నిరసనకారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం సొంతపూచికత్తుపై వదిలేశారు. అరెస్టైన వారిలో బీజేపీ నాయకులు పున్నం బిక్షపతి, లింగంపల్లి రమేష్, బ్రహ్మతేజ, వెంకటేశ్వర్లు, మహిళా మోర్చా నాయకురాలు చిర్రా సరస్వతి ఉన్నారు.

రెండు రోజులపాటు స్కూల్ గేమ్స్

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): నేటి నుంచి రెండో తేదీ వరకు మండలస్థాయి క్రీడాపోటీలు అన్నపురెడ్డిపల్లిలోని సంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నామని వెల్లడించారు.

ఆలయ ఈఓకు సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఈవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె.దామోదరరావును మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆలయంలో ఈవో దామోదర రావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువతో సత్కరించారు. కుంజా ధర్మ, ముత్యాల శ్రీనివాసరావు, రామ్మోహనరావు, వెంకటేశ్వర రావు, వెంకన్న పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ నేత మృతి

గుండాల: ఉమ్మడి గుండాల మండల తెలంగాణ తొలి ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ జాని(80)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన షేక్ జానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉమ్మడి గుండాల మండలం నుంచి ఉద్యమంలో పాల్గొన్న నాయకులు. ఈ సమయంలోనే తెలంగాణ రాష్ట్ర సమితి జెండాను ఎగురువేశాడు. ఆయన కుమారుడు బాబా సైతం బీఆర్ఎస్ ఆళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. ఆయన భౌతిక కాయానికి నివాళి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి, మాజీ జెడ్పీటీసీ కొమరం హన్మంతు, మండల అధ్యక్షులు పాయం నర్సింహరావు, పీఏసీఎస్ చైర్మన్ గొగ్గెల రామయ్య, ఆదాం పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుక

మణుగూరుటౌన్: శ్రీవిద్య టెక్నో కృష్ణవేణి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక స్నేహగార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం త్రివేణి కృష్ణవేణి కళాశాలల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్, స్థానిక ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించి మెమోంటోలు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్, అకమిక్ డైరెక్టర్ సారంగపాణి, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపక బృందంతో పాటు శ్రీవిద్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బద్దం శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ నూకారపు రమేష్ పాల్గొన్నారు.

పడకేస్తున్న పల్లెలు

- దుమ్ముగూడెంలో వందల సంఖ్యలో జ్వరపీడితులు
- అశ్వారావుపేట నియోజకవర్గంలో 11 డెంగీ కేసులు
- నిండుతున్న ఆస్పత్రులు


దుమ్ముగూడెం వైద్యశాలలో చికిత్స కోసం వచ్చిన చిన్నారులు


అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

అశ్వారావుపేట: వర్షాకాలం ప్రారంభం కావడంతోనే అశ్వారావుపేట నియోజకవర్గంలో జ్వరాల కేసులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం కారణంగా సీజనల్ జ్వరాలు శరవేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. వర్షాకాలం రాగానే నియోజకవర్గంలోని కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో జ్వరాలు స్వాగతం పలుకుతాయి. ఆయా గ్రామాల్లో గడిచినేళ్లలో మరణాలు కూడా సంభవించాయి. వీటిలో అశ్వారావుపేట మండలం ఆసుపాక ముందు క్రమంలో ఉంటుంది. జులై, ఆగస్టు నెలలలో అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రిలో 1, దమ్మపేట మండలంలో 2, వినాయకపురం పీహెచ్‌సీలో 3, మందలపల్లి (దమ్మపేట) పీహెచ్‌సీలో 2, మంగపేట పీహెచ్‌సీలో 3 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇలా ప్రభుత్వాసుపత్రులలో 11 కేసులు, ప్రైవేటు ఆస్పతులలో ఎన్ని కేసులు నమోదయ్యాయో లెక్కలు లేవు.

ఖాళీ లేని ఆస్పత్రులు

అశ్వారావుపేట నియోజకవర్గంలో అశ్వారావుపేటలో 100 పడకలతో ఏరియా ఆస్పత్రి ఉంది. అశ్వారావుపేట మండలం వినాయకపురం, గుమ్మడవల్లి, దమ్మపేట మండలం మందలపల్లి, పట్వారిగూడెం, ముల్కలపల్లి మండలం మంగపేట, చంద్రుగొం మండల కేంద్రం, అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటికి తోడు ఎంబీబీఎస్ డాక్టర్ల ఆస్పత్రులు, ఆర్‌ఎంపీల వైద్య సహాయక కేంద్రాలు పుట్టగొడుగుల్లా ఉండనే ఉన్నాయి. వీటిల్లో ఏ ఆస్పత్రికి వెళ్లినా జ్వరపీడితులే అధికంగా ఉంటున్నారు. మండల కేంద్రాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో నిత్యం యాభై మందికి పైగానే జ్వరపీడితులు వస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వాస్పత్రుల్లోనూ గత నెల కంటే ఓపీతోపాటు జ్వరపీడితుల సంఖ్య కూడా పెరిగింది. జ్వరాలను అదుపు చేయడంతో కోసం మున్సిపాలిటీ, పంచాయతీలు, వైద్య సిబ్బంది ఉమ్మడి కార్యాచరణ చేయాల్సిన అవసరం ఉంది.

దుమ్ముగూడెం మండలంలో..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోనూ సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి.. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రతీ ఇంటిలో ఒకరు జ్వర పీడితులు కనిపిస్తున్నారు. మండలంలోని దుమ్ముగూడెం, పర్ణశాల, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రోజుకు వందల సంఖ్యలో జ్వరపీడితులు వచ్చి చికిత్స పొందుతున్నారు.

అప్రమత్తంగా ఉంటేనే..

ప్రజలు అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నుంచి రక్షణ పొందవచ్చు. సైడ్ కాల్వలు, పాత కూలర్లు, టైర్లలో నిల్వ ఉన్న నీటిలో, నివాస ప్రాంతాల సమీపంలోని ఖాళీ కొబ్బరి బొండాల్లో దోమలు పెరిగే అవకాశం ఉంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి. నిల్వ నీటిలో ఈగలు, దోమలు వద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయి. వాటి నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. జ్వరాల బారిన పడిన వారు సమీపంలోని ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలి.

– డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి, దుమ్ముగూడెం పీహెచ్‌సీ

దబ్బతోగు కాలనీలో తాగునీటి అవస్థలు


చెరువు వద్ద నుంచి క్యాన్‌లో నీళ్లు తెచ్చుకుంటున్న మహిళ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామ పంచాయతీ పరిధిలోగల దబ్బతోగు కాలనీ గ్రామంలో గడిచిన ఐదు రోజులుగా తాగునీటి ఇక్కట్లు నెలకొన్నాయి. గ్రామంలో సుమారు 60 కుటుంబాలు ఉండగా, ఈ కాలనీకు సరఫరా చేసే తాగునీటి మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో కాలనీ వాసులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కాగా, మిషన్ భగీరథ నీళ్లు సరిపడా రాకపోవడం, గ్రామ పంచాయతీకు చెందిన మోటారు కాలిపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొంతమంది గ్రామ శివారులో ఉన్న చెరువు వద్దకు వెళ్లి క్యాన్లలో నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తుండగా, మరికొంత మంది వ్యవసాయ బోర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. మోటారు మరమ్మతులకు గురైన మాట వాస్తవమేనని అన్నారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తామన్నారు. రెండు రోజుల్లో మోటారుకు మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా 'కాళ్లూరి'


ప్రతిజ్ఞ చేస్తున్న సంఘం నాయకులు

చంద్రుగొండ: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు మండలాల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కాళ్లూరి సుధాకర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా సుధాకర్‌రావుతోపాటు కార్యదర్శిగా ఎస్సార్ కృష్ణమాచారి, కోశాధికారిగా ఎస్‌కె.మస్తాన్, అసోసియోట్ ప్రెసిడెంట్‌గా జి.బూదయ్య, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా బి.సామ్రాజ్యం, జాయింట్ సెక్రటరీగా ఆంజనేయులు శాస్త్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.నరసమ్మ, పబ్లిసిటీ సెక్రటరీగా వీవీ సైదులును ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వెస్లీ, రామకృష్ణచారి, ఎం.మోహన్‌రావు, ఆనంద్‌కుమార్, నాగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు


పోటీల్లో కుర్చీలాట ఆడుతున్న ఉపాధ్యాయినులు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆదివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించారు. అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు వేర్వేరుగా మండల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, టెన్నికాయిట్, చదరంగం, లెమన్ స్పూన్, కుర్చీలాట పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంఈవో పొన్నంగటి ప్రసాద్‌రావు పర్యవేక్షించగా, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హరిత, నల్లపు కొండలరావు, వీరేశ్వరరావు తోపాటు పీఈటీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రోడ్లపై వరినాట్లు వేసి నిరసన


నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బూర్గంపాడు: సారపాక గ్రామపంచాయతీలోని సుందరయ్యనగర్‌లో అంతర్గత రహదారుల దుస్థితిని తెలియజేసేందుకు సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు ఆదివారం రోడ్లుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుందరయ్యనగర్‌లో అంతర్గత రహదారులు గోతుల మయం అయ్యాయని, నడిచేందుకు కూడా వీలులేనటువంటి దుస్థితిలో ఉన్నాయని అన్నారు. అధికారులు స్పందించి కనీస మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాపినేని సరోజని, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, హుస్సేన్ పాల్గొన్నారు.

యువతలో క్రీడా స్ఫూర్తిని నింపాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హిమాన్షు

చర్ల: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపి, వారిలో క్రమశిక్షణను అలవరచాలని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ సత్యనారాయణపురం సెకెండ్ ఇన్ కామండెంట్ హిమాన్షు కుమార ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యనారాయణపురంలో రెండు రోజుల పాటు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిమాన్షు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ రవి శంకర్ శర్మ, ఇన్‌స్పెక్టర్ నరేంద్రకుమార్ యాదవ్, 81 బెటాలియన్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, జవాన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: చర్లలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు సంతలో సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తున్న నేపథ్యంలో వారి మాటున మావోయిస్టులు, సానుభూతిపరులు, మిలీషియా సభ్యులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరు క్రాస్‌రోడ్ దానవాయిపేట రోడ్‌లలో మోహరించిన పోలీసు బలగాలు.. వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులైన ఆదివాసీలను అదుపులోకి తీసుకుని.. విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. తనిఖీలు నిర్వహించిన వారిలో సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు తదితరులు ఉన్నారు.

కొబ్బరిచిప్పల వేలం ఖరారు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిర్డీ సాయి బాబా మందిరంలో ఆదివారం నిర్వహించిన కొబ్బరి చిప్పల సేకరణ వేలం ఖరారైంది. ఈ పాటలో ముగ్గురు వ్యక్తులు పాల్గొనగా రూ.1,01,116లతో కోనాల జయరాజు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కొమ్మనాపల్లి ఆదినారాయణ, కురిచేటి శ్రీనివాసరావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

దమ్మపేట: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, హైదరాబాద్‌లో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు తరలివెళ్లకుండా ఆశావర్కర్లను, పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం ఆశావర్కర్లను వారి ఇంటివద్దనే అదుపులోకి తీసుకున్న పోలీసులు, స్టేషన్‌కు తరలించారు.

పనులు పూర్తి చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచల పట్టణంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్‌రాజ్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో పట్టణ కార్యదర్శి దాసరి శాంతయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని వెంటనే పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేగల వంశీ, బర్ల రామకృష్ణ, కుసిన్ శ్యాం, బన్నీ, చీకటి దసింబాబు, శ్రీనివాస్, జయరాజ్, శాంతిరాజ్, యేసు, స్వామి, వేలు తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటుకు వినతి


మంత్రి శ్రీహరికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోని ములకలపల్లి మండల కేంద్రంలో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని ఆదివారం రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వినతి చేశారు. ఈ మేరకు మంత్రిను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా కలిసి గ్రామీణ క్రీడాకారులను ప్రతిభను బయటకు తీసేందుకు మినీ స్టేడియం ఎంతో అవసరమని, మంజూరు చేయాలని కోరి వినతి పత్రాన్ని అందించారు. దీంతో స్పందించిన మంత్రి పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

2న జనరల్ బాడీ సమావేశం

మణుగూరుటౌన్: సెప్టెంబర్ 2న మణుగూరు మండలంలో సీపీఐ పినపాక జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు పినపాక నియోజకవర్గ ఆ పార్టీ కార్యదర్శి సరెడ్డిపుల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కిన్నెర కల్యాణ మండపంలో 10గంటలకు జరిగే సమావేశానికి నియోజకవర్గ స్థాయి, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, శాఖ కార్యదర్శిలు, కార్యవర్గ సభ్యులు, మండలాల, పట్టణ కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అత్యాచారాలను అరికట్టాలి


మాట్లాడుతున్న దుర్గ

ములకలపల్లి: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి తొడెం దుర్గ డిమాండ్ చేశారు. మూకమామిడి గ్రామంలో మడకం విజయ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సంఘ మండల మహాసభలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు నెలకు రూ 2,500 వెంటనే చెల్లించాలని అన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్, మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, డివిజన్ అధ్యక్షురాలు నూపా సరోజిని, ఎర్రగొర్ల రామారావు, బండారు నాగేంద్రబాబు, కల్లూరి పద్మ, ఇర్పా తులసి, శ్యామల పాల్గొన్నారు.

వ్యాపారులను ఆదుకోవాలి

భద్రాచలంఅర్బన్: వరదల కారణంగా నష్టపోయిన గోదావరి ఒడ్డున జీవించే 80 మంది చిరు వ్యాపారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, వారికి నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి డిమాండ్ చేశారు. గోదావరి పెరగడంతో యాత్రికులను గోదావరిలోకి అనుమతించకపోవడం.. వ్యాపారులను నష్టంలోనికి నెట్టేసిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం భద్రాచలం పట్టణ వాసి పగిడిపల్లి వెంకట్రావు ఆదివారం మృతిచెందగా.. ఆయన మృతదేహానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూజలు.. అన్నదానాలు.. నిమజ్జనాలు

గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆయా మండపాల వద్ద పూజలు చేపట్టగా.. పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేయగా.. వారు ప్రారంభించారు. పలుచోట్ల గణేషుడిని ఊరేగించగా.. పిన్నలు, పెద్దలు మేళతాళాల నడుమ కేరింతలతో విగ్రహాలను తీసుకెళ్లారు. ఆపై దగ్గరలోని చెరువుల్లో నిమజ్జనాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


భద్రాచలంఅర్బన్: విద్యుత్ శాఖ మండపం వద్ద ఎస్ఈ మహేందర్ దంపతుల పూజలు..


మణుగూరురూరల్: గణనాథుడిని దర్శించుకుంటున్న తహసీల్దార్, సీఐ


భద్రాచలంటౌన్: విద్యా గణపతి అలంకరణలో..


బూర్గంపాడు: గణపతి మండపంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు


గుండాల: సుభాష్ నగర్‌లో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


అశ్వాపురం: మొండికుంటలోని తుమ్మలచెరువు రోడ్ కమ్యూనిటీ వారి ఆధ్వర్యంలో అన్నదానం


ములకలపల్లి: నిమజ్జనంలో చిన్నారులు


మణుగూరుటౌన్: కొండాయిగూడెం వద్ద నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, సీఐ


దుమ్ముగూడెం: నిమజ్జనానికి తరలివెళ్తున్న బుజ్జి గణపయ్యలతో చిన్నారులు